https://teluguislam.net



# యూదులతో జరిగిన ఒప్పందం

మహాప్రవక్త (స) హిజ్రత్ తరువాత ముస్లిముల మధ్య విశ్వాసం, రాజకీయం, సమైక్యతల ద్వారా ఇస్లామీయ సమాజ పునాదుల్ని పటిష్టపరచిన తరువాత ముస్లిమేతరులతో తమ సంబంధాలను దృఢపర్చుకోవడం వైపునకు దృష్టిని మళ్ళించారు. ఈ విషయంలో ఆయన ధ్యేయం, మానవాళి అంతా శుభశాంతుల్ని ఆస్వాదించాలన్నదే. దానికితోడు, మదీనా, దాని పరిసర ప్రాంతాలన్నీ ఒక సమాఖ్యగా ఏర్పడాలన్నదే. కాబట్టి, ఆయన(స) విశాల హృదయంతో, అనాగరిక, విద్వేషపూరిత, వైషమ్యభరిత ప్రపంచం, ఇప్పటివరకు ఊహించలేనటువంటి చట్టాలతో ఓ క్రొత్త సంవిధానాన్ని ప్రవేశపెట్టారు.

మదీనాపురానికి పొరుగున ఉన్నవారు యూదులు అన్న విషయం మనం ఇదివరకే తెలుసుకున్నాం. వీరు రహస్యంగా ముస్లిముల ఎడల శత్రుత్వభావం కలిగి ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు ఎలాంటి ఘర్షణకుగాని, కుతంత్రాలకుగాని పాల్పడలేదు. అందుకని మహాప్రవక్త (స) వారితో ఓ ఒప్పందాన్ని కుదుర్చుకోవడం జరిగింది. ఈ ఒప్పందంలో వారికి, వారి మతం, ధనప్రాణాలకు పూర్తి స్వాతంత్ర్యం ఇవ్వడం జరిగిందే తప్ప, వారి ఎడల శత్రుత్వం వహిస్తూ వారిని దేశ బహిష్కరణకు గురిచేయడంగానీ, వారి ఆస్తిపాస్తులను జప్తు చేసుకోవడంగానీ, విద్వేషభరితమైన రాజకీయం నడపడంగానీ చెయ్యలేదు.

ముస్లిములకు, ముస్లిములకు నడుమ జరిగిన ఒప్పందం లాంటిదే ఆ ఒప్పందం కూడా. ఇప్పుడు ఆ ఒప్పందంలోని ప్రధాన షరతులు ఏవో చర్చించుకుందాం.

## ఒప్పందంలోని ముఖ్యాంశాలు

1. బనూ ఔఫ్‌కు సంబంధించిన యూదులు ముస్లిములతో కలసిపోయి ఒకే సమాజంగా ఉంటారు. యూదులు తమ ధర్మంపైనా, ముస్లిములు ఇస్లామ్ ధర్మంపైనా స్వతంత్రంగా నడుచుకోవచ్చు. అది యూదులు, ముస్లిములు మరియు వారి బానిసలు మరియు సంబంధీకుల హక్కు. బనూ ఔఫ్ తెగే కాకుండా మిగతా యూదుల హక్కులు కూడా ఇలాగే ఉంటాయి.
2. యూదులు, ముస్లిములు వారి వారి ధనాన్ని వారి ఇష్టప్రకారం ఖర్చుపెట్టుకునేందుకు బాధ్యులు.

https://teluguislam.net



3. ఏ శక్తి అయినా ఈ ఒప్పందంలోని ఓ వర్గంతో యుద్ధానికి పాల్పడితే దానికి వ్యతిరేకంగా వీరు ఉభయులు కలసి యుద్ధం చేయాల్సి ఉంటుంది.
4. ఈ ఒప్పందానికి సంబంధించిన ఉభయ వర్గాలు, తమ పరస్పర సంబంధాలను సదాచారం, సుహృద్భావం మరియు ప్రయోజనాల ప్రాతిపదికపై ఏర్పర్చుకోవలసి ఉంటుందే తప్ప దుర్మార్గం మరియు పాపాల ప్రాతిపదికపై కాదు.
5. ఏ వ్యక్తినీ మిత్రపక్షం కారణంగా నేరస్తునిగా నిలబెట్టడానికి వీల్లేదు.
6. పీడితునికి సహాయం అందించడం జరుగుతుంది.
7. యుద్ధం కొనసాగే వరకు యూదులు కూడా ముస్లిములకు తోడు ఆ యుద్ధానికి అయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుంది.
8. ఈ ఒప్పందంలోని ప్రతి వర్గానికి సంబంధించినవారు, మదీనాలో కలహాలను రేపడం, రక్తపాతాన్ని సృష్టించడం హరాం (నిషిద్ధం).
9. ఈ ఉభయ వర్గాల నడుమ కలహాలను సృష్టించే మనస్పర్ధలు ఏవైనా, ప్రస్తుతం లేనటువంటి క్రొత్త పరిస్థితి ఏదైనా ఉత్పన్నమైతే దాని తీర్పు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(స) మాత్రమే ఇవ్వగలరు.
10. ఖురైషులకు, వారి సహాయకులకూ ఎలాంటి రక్షణ కల్పించడం జరుగదు.
11. ఎవరైనా యస్రిబ్‌పైకి దండెత్తి వస్తే, వారిని అందరూ కలసి ఎదుర్కొంటారు. ప్రతి ఒక పక్షమూ తన తన పరిసరాలను సంరక్షించుకునే బాధ్యతను కలిగి ఉంటుంది.
12. ఈ ఒప్పందం ఏ నేరస్తుడూ మరే దౌర్జన్యపరుడూ విషయంలో అడ్డుగా నిలవదు.[1]

ఈ ఒప్పందం జరిగిన తరువాత మదీనా మరియు దాని పరిసర ప్రాంతాలు సురక్షితమైన పాలన క్రిందికి వచ్చేశాయి. ఈ ప్రభుత్వ రాజధాని మదీనాగా, దైవప్రవక్త (స), ఆ ప్రభుత్వానికి పాలకులుగా నియమితులయ్యారు. ఈ ప్రభుత్వ ఆదేశాలు, అధికారం పూర్తిగా ముస్లిములదే. ఇలా మదీనా నగరం ఇస్లామ్‌కు రాజధానిగా మారిపోయింది.

శాంతిసౌభాగ్యాల పరిధిని మరింత విస్తరింపజేసేందుకు దైవప్రవక్త(స) ఆపై ఇతర తెగలతో, పరిస్థితులకు అనుగుణంగా ఇలాంటి ఒప్పందాలనే చేసుకోవడం జరిగింది. వీటిలో కొన్నింటి ప్రస్తావన మునుముందు చెప్పుకోవడం జరుగుతుంది.

---

1. ఇబ్నె హిషామ్-1/ 503,504